లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 31వ వార్డు వడలవానిపేటలో సామాజిక పెన్షన్ల లబ్ధిదారుల ఇళ్లకు మంత్రి రామానాయుడు మంగళవారం వెళ్లి సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలోని ప్రజలు పలు సమస్యలను మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకురాగా వాటిని పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు జివి తదితరులు ఉన్నారు.

- ఏలూరు జిల్లాకు విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్‌తో అధికారుల ప్రణాళిక
- పోలవరం కుడి కాల్వ నుంచి వేయాలంటున్న ప్రజాప్రతినిధులు
- ఆక్వా కాలుష్యంతో పశ్చిమలో తాగునీటి కోసం జనం ఇక్కట్లు
- ఏళ్లు గడిచినా ముందుకు సాగని తాగునీటి పథకం
- గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న జనం
- గత ప్రభుత్వం రూ.3600 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు కుదింపు

వాటర్ గ్రిడ్.. రూటెటు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజానీకానికి అత్యంత అవసరమైన తాగునీటి పథకం (వాటర్ గ్రిడ్) రూటెటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా ఈ పథకం ముందుకు సాగకపోగా, కొత్త ప్రతిపాదనలు సైతం తెరపైకి వస్తున్న పరిస్థితి ఉంది. ఆక్వా చెరువుల కాలుష్యంతో గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న ప్రజానీకానికి తాగునీరు అందించాలనే మనస్సు పాలకులకు రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్వా చెరువుల్లోని కలుషిత నీటిని పంట కాలువల్లోకి వదలడంతో రెండు జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. దీంతో కొనుగోలు చేసే తప్ప ఇక్కడి ప్రజానీకానికి గొంతు తడవని పరిస్థితి ఏర్పడింది. 2014 ఎన్నికల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రతి ఇంటికీ 20 లీటర్ల తాగునీరు ఉచితంగా అందిస్తామని టిడిపి చెప్పింది. గెలిచిన తర్వాత తాగునీటి గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. జనం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్టీఆర్ సుజల ప్రవంతి పథకాన్ని తీసుకొచ్చింది. పలుచోట్ల అప్పటికే గ్రామాల్లో ఉన్న వాటర్‌ప్లాంట్లకు సుజల ప్రవంతి బోర్డులు తగిలించి మసిపూసి మారేడు కాయ చేయాలని ప్రయత్నించారు. ప్రజల నుంచి విమర్శలు రావడంతో అప్పటి టిడిపి ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. 2019 ఎన్నికల ముందు జిల్లాలో జరిగిన పాదయాత్ర సమయంలో వైసిపి అధ్యక్షుడు జగన్ వాటర్ బాటిల్‌తో తాగునీటిని చూపిస్తూ ఈ నీళ్లు మనుషులు ఎవరైనా తాగుతారా అంటూ టిడిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గోదావరి నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా కోసం వాటర్ గ్రిడ్ పథకాన్ని తెరపైకి తెచ్చింది. తొలుత పెద్దఎత్తున హడావుడి చేసిన వైసిపి సర్కార్ తర్వాత ఆ పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది.

తాగునీటి పథకం పట్టాలెక్కేదెప్పుడో..!

గోదావరిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, అరికిరేవుల, పట్టిసీమ మొత్తం ఐదుచోట్ల పంపింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా తాగునీరు ఇచ్చేలా వాటర్‌గ్రిడ్ పథకానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాగా ఉన్నప్పుడు రూపకల్పన జరిగింది. దీనికోసం రూ.3,670 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోజులు గడిచినా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ పథకాన్ని డెల్టా ప్రాంతానికి పరిమితం చేస్తూ రూ.1400 కోట్లకు కుదించారు. అయినప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. జిల్లా విభజనతో ఉమ్మడి పశ్చిమ కాస్తా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలుగా విడిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ పథకం ద్వారా అన్ని మండలాలకు తాగునీరు అందించే ప్రతిపాదన ఉంది. ఏలూరు జిల్లాలో మాత్రం ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో మాత్రమే ఉన్నాయి. ఏలూరు నగరంలో సైతం తాగునీటి సమస్య ఉంది. దీంతో వాటర్‌గ్రిడ్ ద్వారా వేసే పైప్‌లైన్ విజ్జేశ్వరం నుంచి కాకుండా దెందులూరు నియోజకవర్గంలో పోలవరం కుడికాలువ వద్ద వేసి తాగునీరు అందించాలని ఇక్కడి ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్ వేయాలంటే 120 కిలోమీటర్ల దూరం ఉంటుందని, పోలవరం కుడికాల్వ నుంచి వేస్తే 15, 20 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. దీనిపై అధికారులు సరిగా ఆలోచన చేయడం లేదని ఎంఎల్‌ఎలు మండిపడుతున్నారు. దీంతో మరోసారి వాటర్‌గ్రిడ్ పథకం ప్రతిపాదన తెరపైకి చేరింది. దీంతో వాటర్‌గ్రిడ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకానికి ఉపయోగపడే వాటర్‌గ్రిడ్ పథకం పట్టాలెక్కేదెప్పుడోననే చర్చ జనాల్లో సాగుతోంది. ఎన్నికల సమయంలో వాగ్దానాలు గుప్పించడం, గెలిచిన తర్వాత మాటలతో కాలక్షేపం చేయడం పాలకులకు అలవాటుగా మారిపోయిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ముందుగా వాటర్ గ్రిడ్ పథకం పూర్తి చేసి తాగునీరు అందించాలని రెండు జిల్లాల ప్రజానీకం కోరుతున్నారు.

సాంకేతిక ఆధారిత పరిశ్రమలు స్థాపించాలి

జిల్లా అభివృద్ధి ప్రత్యేకాధికారి ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జిల్లా అభివృద్ధి ప్రత్యేక అధికారి సూర్యకుమారి

జిల్లాలో సాంకేతిక ఆధారిత పరిశ్రమలు స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని జిల్లా అభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి తెలిపారు. మహిళా శిశుసంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖల ప్రభుత్వ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులై తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన ఎ.సూర్యకుమారికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. హాజరైన పారిశ్రామికవేత్తల నుండి వారు నిర్వహిస్తున్న ఉత్పత్తి యూనిట్లు, ముడి సరుకుల సేకరణ, మార్కెటింగ్, బ్యాంకు రుణాల మంజూరు, పరిశ్రమల నిర్వహణలో ఎదుర్కొంటున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణను రూపొందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తుల తయారీలో పోటీ పడాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు యూనిట్ స్థాపనకు అనుమతులు, బ్యాంకు రుణాల మంజూరులో అధికారులు తమవంతు సహకారం అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛఆంధ్ర, పి-4 కార్యక్రమాల అమలుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించారని, లక్ష్యసాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పారిశ్రామిక అభివృద్ధి ఎంతో ముఖ్యమని, ఎంతో మంది యూనిట్లు నెలకొల్పడానికి ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ యు.మంగపతిరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా కార్మిక శాఖాధికారి ఎ.లక్ష్మి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఆర్.దేవానందకుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు పెన్షన్లు వినియోగించుకోవాలి

జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి - భీమవరం


పింఛన్లు అందిస్తున్న సూర్యకుమారి, నాగరాణి

ట్రాన్స్‌జెండర్స్ సామాజిక పింఛన్లను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో మెరుగైన జీవనాన్ని సాగించాలని మహిళా శిశుసంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖల ప్రభుత్వ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి అన్నారు. భీమవరం పట్టణంలోని దుర్గాపురం, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామాల్లో నిర్వహించిన ఎన్టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా సూర్యకుమారి పెన్షనర్లతో మాట్లాడుతూ వారి యోగక్షేమాలు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ ఉందా, ఏం పని చేస్తున్నారని ఆరా తీశారు. యాచక వృత్తిని ఇక మీదట కొనసాగించొద్దని సున్నితంగా మందలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. వీరి వెంట డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ ఎపిఒ పెన్షన్స్ మురళీకృష్ణ, సచివాలయ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

తణుకులో క్రిష్టియన్ జెఎసి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - తణుకు

పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని తణుకు క్రిష్టియన్ జెఎసి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జెఎసి ఆధ్వర్యంలో తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి నరేంద్ర కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, క్రైస్తవులు, మైనార్టీలపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వారత్ బాబు, ఒ.మనోజ్ బాబు, ప్రసన్నకుమార్, ఎన్.ఇశ్రాయేలు, కె.డానియేలు, బి.జేమ్స్, కె.బ్లెస్సింగ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై దర్యాప్తు పారదర్శకంగా వేగవంతం చేయాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆర్ఐ రేవు కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబటి ఆనంద్‌కుమార్, గొల్లా రాజ్‌కుమార్, పాలపర్తి సాగర్, మహేష్, దానియేలు, పి.రాజ్‌కుమార్, నక్కా మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంట, పెనుగొండ ఎంఎంసి ఛైర్మన్లు ఖరారు..!

ప్రజాశక్తి - ఆచంట

బడేటి బ్రహ్మాజీ

కేతా సత్యవతి

ఆచంట, పెనుగొండ మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రభుత్వం ఖరారు చేసినట్లు సమాచారం. ఆచంట మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్‌గా కేతా సత్యవతి, పెనుగొండ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా బడేటి బ్రహ్మాజీ పేర్లను దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ కూటమి నేతలతో పలు దఫాలుగా చర్చించారు. కూటమి ఆమోదంతో కేతా సత్యవతి, బడేటి బ్రహ్మాజీ పేర్లను ఖరారు చేసి అధిష్టానానికి పంపించినట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో ఈ రెండు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆచంట పంచాయతీ పరిధి కౌరుపాలేనికి చెందిన బిసి సామాజిక తరగతికి చెందిన కేతా సత్యవతి ఆచంట కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. ఆమె భర్త కేతా మీరయ్య టిడిపి ఆచంట మండల అధ్యక్షునిగా పని చేస్తున్నారు. ఇక పెనుగొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రచారంలో ఉన్న బడేటి బ్రహ్మాజీ గతంలో అదే మార్కెట్ కమిటీకి వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. దీంతోపాటు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల పేర్లు సైతం ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది.

అధిక ఫీజులు వసూళ్లను నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

నినదిస్తున్న నేతలు

కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు విధానాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. పట్టణంలో భాష్యం పబ్లిక్ స్కూల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కూల్ వద్ద నేలపై కూర్చుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ భాష్యం స్కూల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులకు విరుద్ధంగా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్నారు. ఎల్‌కెజికి రూ.30 వేలు, పదో తరగతికి రూ.55 వేల నుంచి రూ.75 వేల వరకూ వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారని చెప్పారు. ఇదేమిటి ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. పైనుంచి వచ్చిన రూల్స్ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై సంబంధిత విద్యా శాఖాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. కచ్చితంగా ప్రభుత్వ నిర్దేశించిన ఫీజులను తల్లిదండ్రులకు తెలియజేసేలా ప్రతి స్కూల్లో ఫీజుల పట్టిక ప్రదర్శించాలని కోరారు. దీనిపై అధికారులు, స్కూళ్ల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు పి.ధనుంజయ్, జి.ధీరజ్, కౌషిక్, సురేష్, సాయి, వేమా సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంటు రవాణా ఛార్జీలు పెంపు

అధికారుల జోక్యంతో పాత ఛార్జీలే వసూలు

ప్రజాశక్తి - నరసాపురం



రూ.40 ఛార్జీగా ముద్రించిన టిక్కెట్

మాధవాయిపాలెం రేవు పాటదారుడు ఆర్థిక సంవత్సరం తొలి రోజు మంగళవారం పంటు రవాణా ఛార్జీలు పెంచి వసూలు చేసే ప్రయత్నం చేశారు. అయితే ప్రయాణికుల ఫిర్యాదుతో అధికారులు జోక్యం చేసుకోవడంతో మధ్యాహ్నం నుంచి పాత ధరలకే టిక్కెట్లు విక్రయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రేవు పాటను కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన శ్రీ వెంకటేశ్వర శాండ్ క్వారీ బోట్‌మెన్ లేబర్ సొసైటీ రూ.4.18 కోట్లకు దక్కించుకుంది. అధికారులు పాటదారుడికి సోమవారం రేవు బాధ్యతలను అప్పగించారు. కొద్దిసేపు పాత ధరలకే టిక్కెట్లు విక్రయించిన పాటదారుడు ఆ తరువాత కొత్త పుస్తకాన్ని బయటకు తీశారు. బైక్‌తో రేవు దాటే ప్రయాణికుడి నుంచి రూ.40 వసూలు చేయడం ప్రారంభించారు. ఇది గతంలో రూ.35గా ఉండేది. దీనిపై కొంతమంది నిర్వాహకులను ప్రశ్నించినా ఛార్జీ పెరిగిందని సమాధానం ఇచ్చారు. దీంతో ప్రయాణికులు ఈ విషయాన్ని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజుకు, ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజుకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎంపిడిఒ రేవులో టిక్కెట్ కౌంటర్‌ను పరిశీలించారు. రూ.40 టిక్కెట్లు ఇవ్వడాన్ని అధికారులు గుర్తించారు. పాత ధరకే రూ.35కే టిక్కెట్ ఇవ్వాలని ఆదేశించారు. కౌంటర్ వద్ద టికెట్ల ధర బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులు పాటదారుడికి సూచించారు.

పెరుగులంక భూములను పేదలకు పంచాలి

ప్రజాశక్తి - పెనుగొండ

వినతిపత్రం అందజేస్తున్న నేతలు

గోదావరి పెరుగులంక భూములను పేదలకు పంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం గోదావరి పరివాహక ప్రాంతంలోని పెరుగులంక భూములను పేదలకు సాధించి పెట్టే వరకూ సిపిఎం ముందుంటుందన్నారు. దళిత పేదలకు లంక భూములు సాధనలో ప్రాణ త్యాగానికైనా సిద్ధమని సభలో చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. లంక భూముల్లో అక్రమ తవ్వకాలు చేపట్టడానికి ఎదురుచూస్తున్న రాబంధులకు అధికారులు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న దళిత పేదలకు సి పట్టా భూములు ఇచ్చిన తర్వాత ఇంత వరకూ సెంటు భూమి కూడా పేదలకు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుమారు 80 ఎకరాలుగా ఉన్న పెరుగులంక భూములను సిద్ధాంతం దళిత పేదలకు పంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహశీల్దార్ బి.అనితకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కప్పల రత్నరాజు, నాగిశెట్టి గంగారావు, గుమ్మడి భాను, రాజు, చిక్కాల చిన్న, ఎం.ప్రసాద్, చింత శ్రీను (మేస్త్రి), కుసుమే వెంకటేశ్వరరావు, నక్క స్వామి, నేలపూడి నాగేశ్వరరావు, గడ్డం శ్రీనుబాబు, బత్తుల దుర్గాప్రసాద్, గడ్డం చంటిబాబు పాల్గొన్నారు.

సిపిఎం 24వ అఖిల భారత మహాసభ ప్రతినిధిగా బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరుగుతున్న సిపిఎం 24వ అఖిల భారత మహాసభకు ప్రతినిధిగా జిల్లావాసి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం హాజరు కానున్నారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వెయ్యి మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరు కానున్నారు.

విజయవాడ, ఉదయగిరి బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

నరసాపురం డిపో నుండి విజయవాడ, ఉదయగిరి పట్టణాలకు రెండు నూతన బస్సు సర్వీసులను ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మంగళవారం కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎల్‌ఎ నాయకర్ స్వయంగా బస్సు నడిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి, నేతలు కోటిపల్లి సురేష్, వలవల నాని, బందెల రవీంద్ర, గంటా కృష్ణ, పోలిశెట్టి సాంబ, తోట అరుణ, బొమ్మిడి కృష్ణకుమారి, కొప్పాడ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో చేనేత వస్త్రాలు మేటి : కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చేనేత వస్త్రాలను చూస్తున్న ఎంఎల్‌ఎ, కలెక్టర్

చేనేత వస్త్రాలు మన్నికలో, నాణ్యతలో మేటి అని, చేనేత వస్త్రాలను అందరూ ప్రోత్సహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్, ఎంఎల్‌ఎ అన్ని స్టాల్స్‌నూ సందర్శించి వాటి తయారీ, మన్నిక, ప్రాంతం, ధర తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఒక చీర కొనుగోలు చేసి రూ.8 వేలు నగదు చెల్లించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు ధరించడం వల్ల హుందాతనంతో పాటు, మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మొట్టమొదటిగా పెద్ద ఎత్తున చేనేత వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా ప్రజలందరూ ప్రదర్శన తిలకించి, వస్త్రాలను కొనుగోలు చేసే చేనేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. ఈ ప్రదర్శన ఏప్రిల్ ఒకటి నుంచి 6వ తేదీ వరకూ కొనసాగుతుందని, ఉదయం 10 నుండి రాత్రి 9 గంటల వరకూ ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 60 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,77,447 నేత కార్మికులు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఉప్పాడ జమధాని చీరలు, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, సిల్క్ చీరలు పావడలు భౌగోళిక గుర్తింపు పొందాయన్నారు. ప్రభుత్వం చేనేత, జౌళి శాఖ పరిశ్రమకు అనుసంధానించబడిన వివిధ సంస్థలతో కలిసి పని చేస్తోందని, వారికి నిరంతర పని అందించడానికి వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి, వాటి ప్రచారానికి అవసరమైన చర్యలను తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.అప్పారావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి పిహెచ్‌సిని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని జనరల్ వార్డు, ఓపి, ఇన్ పేషెంట్, రిజిస్టర్లు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని రికార్డులూ సక్రమంగా ఉన్నాయన్నారు. పిహెచ్‌సిలు అందిస్తున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు వైద్యులు కృషి చేయాలని సూచించారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర, వైద్యులు డాక్టర్ పి.లక్ష్మీ సునంద, పిహెచ్‌సి వైద్య విస్తరణాధికారి ఆర్.కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో ఐదు పరీక్షా కేంద్రాల్లోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఆఖరి ఆరో రోజు సోషల్ పరీక్షకు 744 మంది విద్యార్థులకు 730 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ తెలిపారు. మొగల్తూరులో ఇద్దరు, కెపి.పాలెంలో ఇద్దరు, ముత్యాలపల్లిలో ఆరుగురు, శేరేపాలెంలో ఇద్దరు, జగన్నాధపురంలో ఒకరు మొత్తం 14 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. వన్ టైం ఫెయిలైన ఆరుగురికి నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

పెనుమంట్ర :మండలంలోని మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు 509 మంది విద్యార్థులకు గాను 503 మంది హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజర్యయ్యారని ఎంఇఒ-1 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. పొలమూరు జెడ్‌పి హైస్కూల్ సెంటర్‌లో 73 మందికి 72 మంది, మార్టేరు ఎస్‌విబి జెడ్‌పి హైస్కూల్‌లో 199 మందికి 195 మంది, మార్టేరు బిడి గర్ల్స్ జెడ్‌పి హైస్కూల్‌లో 68 మందికి 67 మంది, పెనుమంట్ర ఆర్‌వి జెడ్‌పి హైస్కూల్‌లో 169 మందికి, 169 మంది పరీక్ష రాశారని తెలిపారు. మండలంలో అన్ని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

నరసాపురం : పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు మండల, పట్టణంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 1,742 మంది విద్యార్థులకు 1,700 మంది హాజరవ్వగా, 42 మంది గైర్హాజరయ్యారన్నారు.

ఉండి : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఉండి ఎంఇఒ బొల్లిపో జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలో నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షలో 622 మంది విద్యార్థులకు గాను 606 మంది హాజరవ్వగా, 16 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మండలంలో పరీక్షా కేంద్రాల ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసిన పోలీస్ సిబ్బందికి, విద్యార్థులు అస్వస్థతకు గురైతే వారికి అవసరమైన వైద్య సదుపాయాలు అందించిన వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

కార్మిక్ ఆర్క్ వెల్డింగ్ రూపకర్త నికోలామ్ బెన్ రోడ్స్ 182వ జయంతి సందర్భంగా మంగళవారం రైతు సంఘం వద్ద జై శ్రీ దుర్గా దేవి వెల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆచంట మండల సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కేతా నాగాంజనేయులు, కోశాధికారి కాండ్రేకుల శ్రీహరి, విడాల శ్రీను, కేతా శాతారావు, కాండ్రేకుల కనకేశ్వరరావు, కె.గోపాలకృష్ణ మూర్తి, కేతా రాంపండు, కేతా వెంకటకృష్ణ, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తణుకు

తణుకు స్కూల్, కాలేజీ బస్ డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల భవనంలో జరిగిన సమావేశం మంగళవారం జరిగింది. ఇటీవల పేకేటి మార్థిబాలు మృతి చెందారు. ఈ సందర్భంగా అతని భార్య పి.సత్యకు డ్రైవర్లు అందరూ కలిసి రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ మాట్లాడుతూ డ్రైవర్లకు ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు వృత్తిరీత్యా వచ్చిన చట్టాలు ఉపసంహరించుకోవాలన్నారు. మృతుని కుటుంబానికి డబ్బులు అందించిన వారిని ప్రతాప్ అభినందించారు. అధ్యక్షులు అందే శ్రీనివాస్, అమీరుద్దీన్, కిరణ్, కె.బాబీ, చౌదరి, బాలాజీ, శంకర్, ప్రసాద్ చిట్టిబాబు పాల్గొన్నారు. అనంతరం పది సంవత్సరాలకు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు.

వివిధం హార్ట్ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వివిధం హార్ట్ వైద్య రంగంలో చేసిన అనేక రకాల సేవలు ఎనలేనివని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఎంఎస్ శివరాజు బద్రిరాజు తెలిపారు. భీమవరంలోని జిల్లా రెడ్ క్రాస్ శాఖ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వివిధం హార్ట్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధం హార్ట్ ఎన్నో పరిశోధనలు చేశారని తెలిపారు. రెడ్ క్రాస్ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళీ కృష్ణారావు మాట్లాడుతూ వివిధం హార్ట్ గుండె, మెదడుకు జరిగే రక్త ప్రసరణపై చేసిన పరిశోధనలు ఇప్పటికీ రక్త ప్రసరణ వ్యవస్థ మూలాలుగా నిలుస్తున్నాయన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి శనివారము రక్తదానాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడారు. అనంతరం అనేకసార్లు రక్తదానం చేసిన కొప్పినీడి బెనర్జీ, డిఎన్ కోశాల ఎనిసిపి విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ శీలం మధ్వేశ్వరావు, శిరిగినీడి శ్రీనివాస్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం అనారోగ్యకరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ వాడకం అనారోగ్యకరమని ఒంటెద్దు, తోపుడు బండ్ల సంఘం సభ్యులు శ్రీనివాసరావు, రుద్రాక్షల మాణిక్యాలు, నిన్నాని రావు అన్నారు. భీమవరం నాచువారి సెంటర్‌లో మంగళవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ఈ విషయంపై ప్రచారం నిర్వహిస్తామని, ప్లాస్టిక్ ఎవరైనా వాడితే పట్టుకుంటామన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి నుంచి ప్లాస్టిక్ నిషేధంపై సోదాలు నిర్వహించి జరిమానాలు వేస్తామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఇంటింటికీ ప్రచారం చేస్తున్నామని అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఒంటెద్దు బళ్ల, తోపుడు బండ్ల సంఘం సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా డిజిటల్ అసిస్టెంట్స్ ఆత్మీయ సమావేశం వర్మ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి 20 మండలాల నుంచి ఎన్నికైన కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో ఇటీవల అర్హులైన 277 డిజిటల్ సహాయకులను గుణాంకాల శాఖలో విలీనం చేసే విధంగా రూపొందించిన కమిటీని ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే రద్దు చేసిందని గుర్తు చేశారు. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిజిటల్ సహాయకుల పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ ఛానల్ ఏర్పాటుపై సమగ్రంగా పునఃపరిశీలించాలని, అలాగే టెక్నికల్ ఎగ్జామ్ రాసి వచ్చిన ఉన్నత విద్యా అర్హతలు కలిగిన వారికి టెక్నికల్ ప్రమోషన్ కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్‌గా ఆదిత్య, జనరల్ సెక్రటరీగా వెంకటేష్, ట్రెజరర్‌గా ఆదిత్య, మహిళా విభాగం సెక్రటరీగా అనూరాధ, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా తీర్మానించారు.

నివాసాల మధ్య ప్రార్థనా మందిరం నిర్మించొద్దు

ప్రజాశక్తి - మొగల్తూరు

నివాసాల మధ్య అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ప్రార్థనా మందిరం నిలిపివేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానికులు పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలోని రామాలయం వీధి ప్రజా నివాసాల మధ్య చాపల బిజాలి చేపట్టిన అక్రమంగా చేపడుతున్న ప్రార్థనా మందిర నిర్మాణాన్ని నిలిపివేయాలన్నారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తిమోతిని పిలిపించి పంచాయతీ అనుమతి లేకుండా ప్రార్థనా మందిరానికి చెందిన షెడ్లు నిర్మించొద్దని గ్రామస్తుల నుంచి ఫిర్యాదు వచ్చినందున సదరు స్థలంలో పంచాయతీ ఇచ్చిన అనుమతి అనుగుణంగా కేవలం ఇంటి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

సాధారణ ప్రసవాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ వల్ల తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాధారణ కాన్పును ప్రోత్సహించాలన్నారు. గర్భం దాల్చిన ముందే సాధారణ కాన్పుపై అవగాహన కోసం దగ్గరలోని ఆసుపత్రిలో కౌన్సిలింగ్ తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, ఆసుపత్రి డైరెక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు, సతీష్, కాగితపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అద్దె భవనంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం..!

సకాలంలో అద్దె చెల్లించని పరిస్థితి - కార్యాలయానికి అద్దెకిచ్చేందుకు నిరాకరణ

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూర్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూర్చలేదు. పిల్లి పిల్లలను పలు ఇళ్లకు తరలించినట్లు మొగల్తూరులోని ఆ కార్యాలయాన్ని పలు అద్దె భవనాలకు తరలించడానికి అధికారులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం కనీసం అద్దె బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ప్రయివేటు భవన యజమానులు సబ్‌జిస్ట్రార్ కార్యాలయానికి అద్దెకు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదు.

మొగల్తూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పేరుకుపోతున్న అద్దె బకాయిలు..

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మసీదు ప్రాంతంలో ఉన్న అద్దె భవనం నుంచి పాలకాలువ ప్రాంతంలోని అద్దె భవనానికి సుమారు ఎనిమిదేళ్ల కిందట తరలించారు. నెలకు రూ.8 వేలు అద్దె చెల్లించే ప్రాతిపదికన ఆ శాఖ అధికారులు ప్రయివేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. మూడేళ్లుగా అద్దె చెల్లించడం లేదు. భవనం ఖాళీ చేయడం లేదు. దీంతో ఆ భవన యజమాని న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఆ భవనాన్ని ఖాళీ చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను న్యాయస్థానం ఆదేశించింది.

ఏడాదికి రూ.15 కోట్లు పైబడి ఆదాయం..

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.15 కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ కార్యాలయానికి సొంత భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టలేదు. దీంతో కార్యాలయ నిర్వహణకు అద్దె భవనమే దిక్కవుతోంది.

గ్రామాలాభివృద్ధే ధ్యేయం

పలు సీసీ రోడ్లను ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో రూ.69 లక్షలతో సీసీ రోడ్లను భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన అందిస్తోందన్నారు. అన్ని గ్రామాల్లోనూ సిమెంట్ రోడ్లు వేయిస్తున్నామని, కోట్లాది రూపాయలతో గ్రామాలను సుందరీకరణ చేశామని తెలిపారు. పల్లెల్లో పండుగ వాతావరణం తెచ్చేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఆనాడు చంద్రబాబు స్ఫూర్తితో గ్రామాల్లో రోడ్లు వేశారని, గత జగన్ ప్రభుత్వం రోడ్లు వేయకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. ఉగాది ఉత్సవాలు, పల్లె పండుగలో భాగంగా నవుడురులో రూ.36 లక్షలతో 3 సీసీ రోడ్లు, కొణితివాడలో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు, ఉత్తరపాలెంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రాయకుదురులో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వైస్ ఎంపిపి అడ్డాల రాము, సర్పంచులు నల్లమెల్లి రేణుక, గెడ్డం భారతి, బి శెట్టి లక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

రాయకుదురులో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

'సంక్షేమ పథకాల అమల్లో నిర్లక్ష్యం సరికాదు'

తణుకు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. వేల్పూరులో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం యర్రా మల్లికార్జునరావు అధ్యక్షతన పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వీరభద్రరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి, బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని తాము ప్రభుత్వాన్ని కోరుతుంటే ప్రభుత్వ మాత్రం కార్మికులు చనిపోయిన తర్వాత చంద్రన్న బీమా పథకంతో పాటు మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10,000 చొప్పున ఇస్తామని ప్రకటించడం బాధాకరమన్నారు. నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం వారు పని చేసే యజమానులు, సంస్థల ద్వారా వివిధ నిర్మాణ కట్టడాల ద్వారా సెస్ రూపంలో వసూలు చేసిన కోట్లాది రూపాయలను రాష్ట్ర సంక్షేమ బోర్డు కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టకపోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఇప్పటివరకూ బోర్డు పునరుద్ధరణకు ప్రభుత్వం ఎటువంటి గైడ్ లెన్స్ విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేద నిర్మాణ కార్మికుల కుటుంబాలకు భరోసాగా ఉన్న సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా పెండింగ్ పారితోషకాలు, ప్రమాద బీమా క్లయిములు వెంటనే మంజూరు చేసి కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాటాల నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, కె.అర్జున్, ఆనందం గంగాధర్, అత్యం పెద్దిరాజు, వీరవల్లి వెంకన్న, ముదిగొండ రాముడు, ఎం.మాధవకృష్ణ, రాజా పాల్గొన్నారు.

గుంపర్రులో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని గుంపర్రు గ్రామంలో మంగళవారం కూటమి నాయకులు ఈతకోట శేషగిరిరావు, చేగొండి వెంకటేశ్వరరావు, చిట్టూరి సీతారామాంజనేయులు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు ఇవ్వడం వల్ల వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, మంచన పడ్డ రోగులు కళ్లల్లో ఆనందం చూస్తుంటే కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనికి తమకెంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జడ్డు రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు అందజేస్తున్న కూటమి నేతలు

తాడేపల్లిగూడెం:పింఛనుదారులకు ప్రతి నెలా 1వ తేదీన ఇంటి వద్దే పింఛన్ అందిస్తున్నామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాజ్జీ అన్నారు. మంగళవారం పట్టణంలోని 12వ వార్డులో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 4వ వార్డులో ఈసారపు గురవయ్యకు కొత్తగా మంజూరైన డయాలసిస్ పెన్షన్ పది వేల రూపాయల పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు రాంపండు, తాటికాయలు వీరన్న, ముప్పిడి రమేష్, దాట్ల జగన్నాథరాజు పాల్గొన్నారు.

ఉండి : ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని 94 శాతం పూర్తి చేసినట్లు మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకటో తేదీనే వృద్ధులకు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దే పింఛను అధికారులు పంపిణీ చేశారని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి సాయం

తాడేపల్లిగూడెం:ఇటీవల మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు గోదావరి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గన్నపేట గ్రామానికి చెందిన యువకుడు దూలపల్లి రాజు ఇటీవల గృహ నిర్మాణ పని చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. అతనికి తల్లిదండ్రులు లేరు, అవివాహితుడు, సోదరి గల్ఫ్ ఉపాధికోసం వెళ్లారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం, ఎఐటియుసి నాయకులు పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ తదితరుల కృషితో ఇంటి యజమాని దుట్టా వెంకటరాజు రూ.25 వేలు, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10 వేలు తోటి కార్మికులు రూ.5 వేలు కలిపి రూ.40 వేలను జగ్గన్నపేటలో రాజు మేనల్లుడు కూనపాముల నానీకి అందచేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, ఎఐటియుసి నేతలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు అన్నారు. మంగళవారం పెదఅమిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో అన్ని గ్రామాలకూ కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలనే ఉద్దేశంతో తాను చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతి, తన కస్టోడియల్ టార్చర్ కేసులో జరుగుతున్న పరిణామాలు పలు ఇతర ముఖ్య అంశాలను వివరించారు.

నిధుల మంజూరుకు ఎన్యుమరేటర్లు కృషి చేయాలి

గణపవరం:మండలంలో డ్వాక్రా గ్రూపుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మంజూరు చేసే విధంగా ఎన్యుమరేటర్లు కృషి చేయాలని ఎపిఎం అమర్ ఉన్నీసా అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైన నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2025, 26 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రతి ఐదు గ్రూపులకు ఒకరు చొప్పున మొత్తం 228 మందిని నియమించినట్లు చెప్పారు. డిపిఎం అనిత మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు జీవన సర్వే సక్రమంగా చేసి గ్రూపుల ఆర్థిక అవసరమైన నిధులు కేటాయింపునకు సంబంధించిన వివరాలు పైఅధికారులకు పంపాలని చెప్పారు.కార్యక్రమంలో సిసిలు మాధవి, రామచంద్రరావు, హేమ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

తాడేపల్లిగూడెం:చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్, విజయవాడ కామినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో జువ్వలపాలెం 16వ వార్డు ఐదు గుడుల సెంటర్ నూకాలమ్మ గుడి వద్ద మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాలూరి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు పేదల పట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ సేవలను అభినందించారు. శిబిరంలో గుండె సంబంధ వ్యాధులతో పాటు, ఆయాసం, ఉబ్బసం, శ్వాస కోస వ్యాధులు, బిపి, పక్షవాతం, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పాలూరి వెంకటేశ్వరరావు, జనసేన జువ్వలపాలెం ఇన్‌ఛార్జి పాలూరి నాగ బలుసులరావు (బూరయ్య), మైలవరపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

శివన్నారాయణపురానికిరేషన్ వాహనాన్ని పంపాలి

భీమవరం టౌన్:భీమవరం రూరల్ శ్రీరాంపురం గ్రామం శివన్నారాయణపురానికి రేషన్ వాహనాన్ని పంపించాలని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరామపురం గ్రామం సదాశివరావుపేట శివన్నారాయణ పురంలో 200 కుటుంబాలు నివసిస్తున్నారని, రేషన్ వాహనం రాకపోవడం వల్ల ఒంటరి మహిళలు, వృద్ధులు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న శ్రీరామపురం వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రేషన్ వాహనాన్ని పంపించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గుడాల సత్యవతి, ఎస్.తులసమ్మ, సీతమ్మ, ఎల్.పార్వతి, గుర దాసి అచ్చమ్మ పాల్గొన్నారు.

బిసి రక్షణ చట్టం అమలు చేయాలి

భీమవరం : నందమూరి గరువు గ్రామంలో కోట సత్తెమ్మ తల్లి జాతరలో చోటుచేసుకున్న ఘర్షణలో గౌడ యువకుడు కాసాని రాజేష్ (17) అగ్రకులాల దాడిలో మృతి చెందడం బాధాకరమని బిసి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిసి సంక్షేమ సంఘం (కేసన శంకర్రావు కమిటీ) రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యమ మురళిగౌడ్ మాట్లాడారు. బిసిల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. గతంలో చెరుకుపల్లి మండలం రాజోలులో విద్యార్థి అమర్నాథ్ గౌడ్ హత్య ఘటనలో అప్పటి వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల రక్షణ కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. వెంటనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కాసాని రాజేష్ కుటుంబాన్ని పరామర్శించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ట్రెజరర్ కుక్కల రాంప్రసాద్, అడ్వకేట్ మోర్ల వెంకటకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

గొరగనమూడిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న రఘురామ కృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. విస్సాకోడేరులో నూతనంగా నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లు, బిసి కమ్యూనిటీ హాల్, ఆలం ట్రీట్మెంట్ ప్లాంట్, పిల్లల దత్తత కేంద్రం, గొరగనమూడిలో సీసీ రోడ్లను మంగళవారం సర్పంచులు బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల వెంకట శివరామరాజు ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వ నిధులతోపాటు అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాలను అభివృద్ధి చేస్తున్న సర్పంచులు శ్రీనివాస్, శివాజీరాజును రఘురాం కృష్ణంరాజు అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచులు కందుల నాగరాజు, దిడ్ల విమల రవి, ఎంపిటిసిలు బొల్లం గాంధీ, లక్ష్మీపార్వతి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్, తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపిడిఒ రెడ్డియా, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, అగ్రికల్చర్ ఎఒ నారాయణరావు, నాయకులు నడిపూడి అప్పారావు, ఆరేపల్లి నాగరాజు, బాలకృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

కాళ్ల:గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా నూతన కూటమి ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణంరాజు అన్నారు. సీసలి, బొండాడ, బొండాడపేట, పెదఅమిరం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను రఘు రామకృష్ణంరాజు మంగళవారం ప్రారంభించారు. సీసలి, బొండాడ, బొండాడపేట, పెదఅమిరం గ్రామాల్లో ఆరు రోడ్ల నిర్మాణ పనులు ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరైన రూ.68.76 లక్షలతో చేపట్టారు. సీసలిలో సిమెంట్ రోడ్ల నిర్మాణం పట్ల సర్పంచి బిళ్లకుర్తి ధనలక్ష్మి పలువురు నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు, బొండాడ పేట సర్పంచి గుడ్ల మధుసూదనరావు, టిడిపి బొండాడ గ్రామ అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కాళ్లలో..

కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

తణుకు:కొబ్బరి ఒలుపు, దింపు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తణుకు ఏరియా కొబ్బరి ఒలుపు, దింపు కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. మంగళవారం ఇరగవరం మండలం చుక్కవానితోట గ్రామం కొబ్బరి తోటలో జరిగిన తణుకు ఏరియా కొబ్బరి ఒలుపు, దింపు కార్మిక సంఘం కమిటీ సమావేశంలో భీమారావు మాట్లాడారు. కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులు చెట్లు ఎక్కుతూ, దిగుతూ ప్రమాదాలకు గురయ్యే వారికి ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, అంగవైకల్యానికి గురైన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం తణుకు ఏరియా అధ్యక్షులు బొక్కా సత్యనారాయణ, కార్యదర్శి కౌరు శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై జగన్ వైఖరి చెప్పాలి

పాలకొల్లు :రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణపై జగన్ తన వైఖరిని స్పష్టంగా చెప్పాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నబాబు, పలువురు జిల్లా నేతలు డిమాండ్ చేశారు. పాలకొల్లు ఎఎంసిలో మంగళవారం జరిగిన జిల్లా ఎంఆర్‌పిఎస్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్ఆర్ ఎస్‌సిల వర్గీకరణకు సంపూర్ణ మద్దతిస్తానని ప్రకటించారని, అయితే జగన్ అధికారం చేపట్టాక మాదిగలను దోషులుగా చూశారని చెప్పారు. శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు కూడా ఎస్‌సి వర్గీకరణపై స్పష్టమైన వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, కానూరు, విజయవాడలో
F.A. No. 757 / 2024 in CC No. 25/2023
(తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల ఫోరమ్ రాజమహేంద్రవరం వారి ఫైలు)

బిట్వీన్:
1)ది.డివిజనల్ మేనేజర్, చోళమండలం యం.యస్. జనరల్ ఇన్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ & వగైరాలు. ...అప్పిలెంట్స్
మరియు
వేటుకూరి సుబ్బలక్ష్మీ, భర్త. సూర్యనారాయణ రాజు ...రెస్పాండెంట్

టు,
వేటుకూరి సుబ్బలక్ష్మీ, భర్త. సూర్యనారాయణ రాజు, విలాస గ్రామం, ఐనవిల్లి(మం), డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పైనెంబరు అప్పీలు పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్/శ్రీకోర్టువారి ద్వారా, నోటీసు పంపిననూ మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పైకోర్టు/స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ **ది.29-04-2025**కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు **ఉ॥గం॥10-30ని॥లకు** మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది.29-04-2025

యస్.ఐ. ఖాదర్, B.Sc., B.L., అప్పిలెంట్స్ తరపు న్యాయవాది
కృష్ణనగర్, గుంటూరు.సెల్: 9866320410

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 58/2014

Between:
Padala Sujata ... **Plaintiff**
And
1. Karri Veereddy
2. Karri Harika reddy ... **Defendants**

To, Defendant No.2
కర్రి హారికరెడ్డి, W/o. కర్రి వీరెడ్డి Hindu, Femele, Aged about 35 years, House wife, owner of Venkata Satyanarayana, Rice Mill, K.N.Road, opp. Chakali chervu, Pentapadu, Pentapadu mandal, W.G. Dist. TPG/PJCJ.

పై నెంబరు దావా గ్రంథములో 2nd Defendant నకు శ్రీకోర్టు వారు కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికిని తీసుకొనకుండా Avoid చేస్తున్నందున order5 Rule 20 ప్రకారం Substitute of Service ద్వారా అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డర్ వేసినందున పై నెంబరు దావా గ్రంథములో **ది. 09-04-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

A. Dasaradha Ram
Advocate,
Tadepalligudem
Dt. 01-04-2025
Tadepalligudem, W.G.Dt
Cell: 70136 60425

In The Court Of The Pril, Civil Judge (Junior Division) Tanuku
I.A.No. 2/2024, 3/2024 & 4/2025 in O.S.No. 199/2021

Between:
Velagala Adinarayana Reddy, Proprietor Arunodaya Fertilizers & Pesticides, rep.by Authorized Manager, Velagala Mahendra Reddy ... **Petitioner/Plaintiff**
And
Ganta Kasi Visweswara Rao, (died) Proprietor Kanaka Durga Traders, Katavapadu & Others ... **Respondents/Defendants**

పిటిషనరు/వాది తరుపున వేయించిన ప్రకటన

4. Ganta Masesh
S/o late Kasi Visweswara Rao,
Kathavapadu Village,
Iragavaram Madal, TJCJC.

5. Ganta Sesi Saie Tulasi
D/o late Kasi Visweswara Rao,
Kathavapadu Village,
Iragavaram Madal, TJCJC.

యిందుమూలంగా 4వ మరియు 5వ రెస్పాండెంట్లకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు యల్.ఆర్.ఎబెట్మెంట్ మరియు డిలేకండోన్ పిటిషన్లలో కోర్టు ద్వారా మీకు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో పిటిషన్లు విచారించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

గుడిమెట్ల వీర్రెడ్డి
వాది తరపు అడ్వకేటు,
తణుకు
ది.01-04-2025,
తణుకు
సెల్: 94406 07793